# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
12-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 140

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# మరింత మందికి చేయూత

## పింఛన్లపై తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన

- ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే అర్హతలు
- నిబంధనల్లో ఎలాంటి కొత్త మార్పులు ఉండవు
- ఈ నెలాఖరు వరకు దరఖాస్తులకు గడువు
- గతంలో దరఖాస్తు చేసినవారు మళ్లీ
- దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో కొత్త చేయూత పింఛన్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. పింఛన్ల అర్హతపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇచ్చారు. గతంలో అమల్లో ఉన్న ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఈసారి కూడా అర్హతలను నిర్ణయిస్తున్నట్టు వెల్లడించారు.

ప్రస్తుతం నిబంధనల్లో ఎలాంటి కొత్త మార్పులు చేయలేదని స్పష్టం చేశారు. అయితే, మొదటి దశలో ఒంటరి మహిళలు, వితంతువులు,

- మిగతా 3వ పేజీలో

# కేటీఆర్ లేఖల అస్త్రం!



## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతి ప్రాజెక్టుపై అనుమానాల పర్వం

అవినీతి మరకను అంటించే ప్రయత్నం

తాజాగా రాయదుర్గం పీఎం ఏక్తమాల్ టెండర్ ప్రక్రియ పై..మండిపడుతున్న అధికార పార్టీ

తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. పట్టు పెంచుకునేందుకు భారత రాష్ట్ర సమితి.. పట్టు నిలుపుకునేందుకు అధికార కాంగ్రెస్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు భారతీయ జనతా పార్టీ సైతం బలం పుంజుకునేందుకు గట్టి ప్రయత్నాలు మొదలు పెట్టింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

అయితే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి తెలంగాణ ప్రభుత్వం ఏ పని చేసినా.. అందులో అవినీతిని వెతుకుతోంది. ఆధారాలు లేకపోయినా ఆరోపణలు చేస్తున్నారు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అయితే రాహుల్ గాంధీకి..

- మిగతా 2వ పేజీలో



## కొత్త యూట్యూబర్లకు కష్టకాలం

### మానిటైజేషన్ వాచ్‌టైమ్‌ను పెంపు

న్యూఢిల్లీ,ఆగస్ట్11 : కొత్త యూట్యూబర్లకు కష్టకాలం వచ్చింది. మానిటైజేషన్‌కు అవసరమైన వాచ్‌టైమ్‌ను ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ రెట్టింపు చేసింది. క్రియేటర్లు వీడియోల ద్వారా డబ్బు సంపాదించడానికి వీలు కల్పించే యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్‌లో

# ఉచితాలతో దుబారా!






ఇబ్బందుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

బాధ్యతారాహిత్యమైన సంక్షేమ రాజకీయాలపై హైకోర్టు జడ్జి ఆవేదన

ఆలోచింపజేస్తున్న న్యాయమూర్తి వ్యాఖ్యలు

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్**

ప్రభుత్వాలు ఒకవైపు ఉచిత సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. రాజకీయ పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నాయి. అంతకుమించి పథకాలు అందిస్తామని హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఉచిత పథకాలపై ఆందోళన వ్యక్తం చేసింది. హద్దులు లేని ఉచిత పథకాలతో రాజ్యాన్ని నడిపిస్తే.. భవిష్యత్తులో కుబేరుడు కూడా పనికి ఆహార

2లో

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

## యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం

### ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్11: తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

2లో పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి



# చరిత్రలో నిలిచిపోయేలా గోదావరి పుష్కరాలు!

- కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఏర్పాట్లు
- 238 పుష్కర ఘాట్లు
- పాతవాటి ఆధునీకరణ, కొత్త వాటి నిర్మాణం
- ఈసారి డిజిటల్ సేవలు
- గత అనుభవాల దృష్ట్యా భద్రతకు పెద్దపీట

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** గోదావరి పుష్కరాలకు తెలుగు రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి. ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు

3లో

# ఎమ్మెల్సీలుగా ఆ ఇద్దరు!



## గవర్నర్ కోటా కింద యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమామహేశ్వరరావు

## సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీలో గవర్నర్ కోటా కింద రెండు ఎమ్మెల్సీ పదవుల భర్తీపై ప్రభుత్వం ప్రత్యేకంగా కసరత్తు ప్రారంభించింది. పది రోజుల కిందట గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఉన్న జాఖియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యంగా మారింది.



# విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

- 132కు చేరిన మృతుల సంఖ్య
- శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ, క్రైమ్ మిర్రర్:** కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది.

3లో

# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు



- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- నెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# కొత్త యూట్యూబర్లకు కష్టకాలం

చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు యూట్యూబ్ బ్లాగ్‌పోస్ట్ వెల్లడించింది. ఇంతకు ముందు.. డబ్బు సంపాదించాలంటే కంటెంట్ క్రియేటర్లు గత 365 రోజుల్లో 4,000 వాచ్ అవర్స్ లేదా 10 మిలియన్ షార్ట్స్ వ్యూస్ ఉండాలి. అయితే.. కొత్త నిబంధనల ప్రకారం గత 365 రోజుల్లో 8,000 క్వాలి÷డ్ వాచ్ అవర్స్ లేదా గత 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు ఉండాలి. 1,000 మంది సబ్‌స్క్రైబర్‌లు ఉండాలనే నియమంలో మాత్రం ఎటువంటి మార్పు లేదని తెలిపింది. అయితే ఇప్పటికే యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ లో ఉన్న క్రియేటర్లపై ఈ ప్రభావం ఉండబోదని పేర్కొంది. ప్రోగ్రామ్‌లో ఇప్పటికే 3 మిలియన్లకు పైగా కంటెంట్ క్రియేటర్లు ఉన్నారు. ఈ నిబంధనలు 2027 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. యూట్యూబ్ షార్ట్స్ ద్వారా వచ్చే ఆదాయం కోసం కూడా ఈ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. షార్ట్స్‌పై వచ్చే ప్రకటనలు, సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచుకోవడానికి అర్హత పొందాలంటే క్రియేటర్లు 90రోజుల వ్యవధిలో 10 మిలియన్ల షార్ట్స్ వ్యూస్ కలిగి ఉండాలి. ఈ నిబంధన కొత్త క్రియోటర్లతో పాటు ఇప్పటికే ఉన్నవారికి కూడా వర్తిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఇది అమల్లోకి వస్తుంది. యూట్యూబ్ ప్రీమియం అందుబాటులో ఉన్న అన్ని దేశాలకు ఈ ప్లాట్‌ఫామ్ ప్రీమియం లైట్ సేవలను విస్తరించింది. ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా అందులోని కంటెంట్‌ను నిరంతరాయంగా చూడొచ్చు. ప్రీమియం లైట్ సేవలు భారత్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. దీని ధర నెలకు రూ.89 కాగా, స్టాండర్డ్ ప్లాన్ ధర రూ. 149. దీనివల్ల క్రియేటర్లు అధిక ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని పేర్కొంది. యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రొగ్రామ్‌లో 2018 తర్వాత తొలిసారిగా భారీ మార్పులు చేయనున్నట్లు యూట్యూబ్ ప్రకటించింది. ఎ÷-లాట్‌ఫామ్‌లో క్రియేటర్ల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో మానిటైజేషన్ నిబంధనలను కంపెనీ మరింత కఠినతరం చేసింది. షార్ట్స్, ప్రకటనలు, ప్రీమియం ఆదాయ భాగస్వామ్యానికి సంబంధించిన నిబంధనలను సవరించింది. యూట్యూబ్ షాపింగ్‌లో నిర్దిష్ట మైలురాళ్లు చేరిన వారికి బోనస్‌లు, బ్రాండ్ డీల్స్‌కు ప్రోత్సాహకాలు, ట్రెండింగ్ కంటెంట్ ప్రారంభించి అభివృద్ధి చేసే వారికి అదనపు ఆదాయ అవకాశాలు కల్పించనుంది. యూట్యూబ్ ప్రీమియం లైట్‌ను అందుబాటులో ఉన్న అన్ని దేశాలకు విస్తరించనున్నారు. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చే నికర ఆదాయంలో 30 శాతం, ప్రీమియం లైట్ ద్వారా వచ్చే ఆదాయంలో 60 శాతం క్రియేటర్ల కోసం కేటాయిస్తారు. సభ్యులు చూసే సమయం, వీడియోల వ్యూస్ ఆధారంగా ఈ మొత్తాన్ని క్రియేటర్లకు పంపిణీ చేస్తారు. లాంగ్ ఫార్మ్ వీడియోలకు 55 శాతం, షార్ట్స్‌కు 45 శాతం రెవెన్యూ షేర్ లభిస్తుంది. అయితే యూట్యూబ్‌లో కొత్తగా మానిటైజేషన్ పొందాలనుకునే వారికి ఈ నిబంధనలు కాస్త సవాలుతో కూడుకున్నవే. ఇప్పటి వరకు ఉన్నదాని కంటే రెట్టింపు వాచ్‌టైమ్ సాధించడం అంత సులభమైన పని కాదు. కాబట్టి కేవలం వైరల్ కంటెంట్‌పై ఆధారపడకుండా ఒరిజినల్ కంటెంట్‌ను ఇస్తూ వ్యూస్ సాధించగలిగితే క్రియేటర్లకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంటుంది.

# ఎమ్మెల్సీలుగా ఆ ఇద్దరు!

అయితే ఇప్పుడు పది రోజులు అవుతున్న వారి స్థానంలో కొత్త వారి ఎంపికకు సంబంధించి కసరత్తు ప్రారంభం కాలేదన్న వార్తలు వచ్చాయి. ఎన్నికల కమిషన్ సన్నాహాలు ప్రారంభించకపోవడంతో ఈ అనుమానాలకు బలం చేకూరింది. కానీ ఇప్పటికే సీఎం చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టినట్లు ప్రచారం జరుగుతుంది.

**ఈ రెండు పదవులు టిడిపికే..**

ప్రస్తుతం మూడు పార్టీల ఉమ్మడి ప్రభుత్వం నడుస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి రాజకీయ నిర్ణయం మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయంతో కుదురుతోంది. అందుకే చంద్రబాబు అటు జనసేనతో పాటు బిజెపిని సైతం సంప్రదించినట్లు తెలుస్తోంది. టిడిపిలో ఆశావహులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆ రెండు పదవులు తమ పార్టీకి విడిచి పెట్టాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. అందుకు ఆ రెండు పార్టీలు సమతించడంతో చంద్రబాబు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. గత రెండు రోజులుగా దీనిపై కసరత్తు చేసి ఇద్దరు పేర్లను ఖరారు చేసినట్లు ప్రచారం నడుస్తోంది. ఈసారి ఇద్దరూ సీనియర్లకే అవకాశం కల్పించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**రాజ్యసభ ఆశావహుడిగా..**

బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పేరు దాదాపు ఖరారు అయినట్లు టాక్ నడుస్తోంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభ పదవిని ఆశిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న యనమల రామకృష్ణుడుకు ఆ పార్టీలో ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వచ్చింది. పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి మంత్రి పదవి దక్కింది. ఒకసారి మాత్రమే స్పీకర్ పదవి చేపట్టాల్సి వచ్చింది. 2014లో ఎమ్మెల్సీగా ఉన్న యనమలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు చంద్రబాబు. ఈసారి కూడా ఎమ్మెల్సీగా ఉన్న ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ ఈసారి జూనియర్లతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. మొన్ననే రాజ్యసభ పదవి ఎంపిక సమయంలో యనమల పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ వివిధ సమీకరణలో ఆ అవకాశం ఇవ్వలేకపోయారు. అయితే ఎమ్మెల్సీగా యనమల ఒప్పుకుంటారో లేదో చూడాలి.

**దేవినేని ఉమా కు ఛాన్స్..**

మరోవైపు సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన టిడిపిలో సుదీర్ఘకాలం సేవలందిస్తూ వచ్చారు. 1999 నుంచి 2014 వరకు ఏకధాటిగా గెలిచారు. 2019లో మాత్రం ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో ఆయన తన సీటును త్యాగం చేశారు. వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణ ప్రసాద్ కోసం తన సీటు వదులుకోవాల్సి వచ్చింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇస్తామన్న హామీ ఉంది. ఆ హామీ ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తోంది. చూడాలి ఎలాంటి నిర్ణయం ఉండబోతుందో..

# కేరళ ఇకనుంచి కేరళంగా మార్పు

## లోక్‌సభలో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం

న్యూఢిల్లీ: కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ బిల్లుపై ప్రక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది.

# ఉచితాలతో దుబారా!

(మొదటి పేజీ తరువాయి)

పథకంలో కూలీగా మారక తప్పదు అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ గా మారాయి. కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వ ఆదాయం, ఉచిత పథకాల వ్యయం మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని ఎండగట్టారు న్యాయమూర్తి. బాధ్యతారాహిత్యమైన సంక్షేమ రాజకీయాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమం పేరుతో అర్హతలతో సంబంధం లేకుండా పథకాలను వర్తింప చేయడం వల్ల ప్రజాధనం వృధా అవ్వడమే కాకుండా.. ప్రజల్లో బాధ్యతారాహిత్యం పెరుగుతుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించడం విశేషం.

**ప్రజల బాగోగులు ఎలా..**

గత కొంతకాలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో రకరకాల చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. రాష్ట్ర బడ్జెట్ గణాంకాలు విశ్లేషిస్తూ న్యాయస్థానం స్పష్టమైన లెక్కలను తెరపైకి తెచ్చింది. రూ.3.24 లక్షల కోట్ల మేర ఆదాయం వస్తోందని.. అందులో ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, యంత్రాంగ



నిర్వహణ ఖర్చులు పోను మిగిలేది కేవలం రూ.90 వేల కోట్లు మాత్రమేనని న్యాయమూర్తి తేల్చేశారు. అందులో సింహభాగం రూ.89 వేల కోట్లు ఉచిత పథకాలకి ధారపోస్తుంటే ఇక మౌలిక వసతులు, భవిష్యత్ తరాల అభివృద్ధికి నిధులు ఎక్కడివి అంటూ ప్రశ్నించడం విశేషం. చేతిలో ఐఫోన్లు, ఇంటిముందు పల్సర్ బైకులు ఉన్నవారు కూడా రేషన్ బియ్యం కోసం క్యూలైన్లో నిలబడుతున్న వైపరీత్యాన్ని ప్రశ్నించారు న్యాయమూర్తి. ఇటువంటి ధోరణులు వ్యవస్థలను కూల్చేస్తాయని హెచ్చరించారు.

**చెల్లింపుల్లో బకాయిలపై..**

ఇంతకీ న్యాయమూర్తి ఎందుకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారంటే.. కంటోన్మెంట్ బోర్డు కు చెల్లించాల్సిన బకాయిల విషయంలో. రూ. 32 కోట్ల బకాయిలను రెండేళ్లు గడిచిన చెల్లించలేదు దీనిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణకు వచ్చింది. ఈ కేసులో ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా స్వయంగా హాజరయ్యారు. ఎప్పటికీ 27 కోట్ల రూపాయలు చెల్లించామని.. మిగతా మొత్తాన్ని వాయిదాలలో చెల్లిస్తామని వివరణ ఇచ్చారు. స్వల్ప మొత్తాన్ని కూడా వాయిదా పద్ధతుల్లో చెల్లించాల్సిన దుస్థితికి ప్రభుత్వం ఏర్పడడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు న్యాయమూర్తి. ఉచితాల భారంతోనే ఈ పరిస్థితి వచ్చిందని అభిప్రాయపడ్డారు న్యాయమూర్తి. తాను ఏ రాజకీయ పార్టీనో.. లేదా వ్యక్తులను విమర్శించడం లేదని.. ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా, న్యాయమూర్తిగా వ్యవస్థల భవిష్యత్తుపై ఉన్న ఆందోళనతోనే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నానని న్యాయమూర్తి చెప్పుకొచ్చారు. మొత్తానికి అయితే జడ్జి కామెంట్స్ ఇప్పుడు విపరీతంగా ఆలోచింపజేస్తున్నాయి.



# విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది.

# కేటీఆర్ లేఖల అస్త్రం!

లేకుంటే ప్రధాని నరేంద్ర మోడీకి లేఖలు రాస్తున్నారు. తాజాగా హైదరాబాద్ రాయదుర్గంలో ప్రతిపాదించిన పిఎం ఏక్తా మాల్ టెండర్ ప్రక్రియ పై ఆరోపణలు చేశారు కేటీఆర్. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన్ డిస్ట్రిక్ - వన్ ప్రోడక్ట్, స్వదేశీ హస్తకళలు, మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో యూనిట్ మాల్స్ నిర్మిస్తున్నారు. తెలంగాణలోని హైదరాబాద్ లోకల్ కాన్సెప్ట్ కింద ఐటీ కారిడార్ అయిన రాయదుర్గంలోని 6. 30 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ స్థలంలో ఈ మాల్ నిర్మాణానికి డిజైన్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ పథకం కింద సుమారు రూ.202 కోట్ల వడ్డీ లేని రుణం అందిస్తోంది.

**పీపీపీ విధానంలో నిర్మాణం..**

ఈ కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు నిర్మించే బాధ్యతను పబ్లిక్- ప్రైవేట్- పార్ట్నర్ షిప్ మోడల్ లో చేపట్టడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గ్లోబల్ టెండర్లు పిలిచి ఒక ప్రైవేటు కన్సార్టియం ను ఎంపిక చేసింది. అయితే ఈ టెండర్ నిబంధనలలో తీవ్ర అవినీతి, విచ్చలవిడి నిధులు మళ్లింపు జరిగిందంటూ కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఏకంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కు లేఖ రాశారు. భూమి విలువను మినహాయించి ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.2059. 81 కోట్లు గా ఉంటే.. అందులో ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనం కంటే.. ప్రైవేటు డెవలపర్ కు అపరిమితంగా దోచి పెట్టేలా నిబంధనలు తీర్చిదిద్దారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు.

**ప్రైవేటు సంస్థకు లబ్ధి..**


ఇటీవల ప్రభుత్వాలు పీపీపీ విధానాన్ని ఎక్కువగా అనుసరిస్తున్నాయి. ఈ విధానంలో ఏవైనా కాంప్లెక్స్ లు లేదా మాల్స్ కట్టేటప్పుడు ప్రైవేటు పెట్టుబడిదారుడు తన సొంత నిధులతో మిగిలిన నిర్మాణ వ్యయాన్ని భరిస్తాడు. దానికి పరిహారంగా ప్రాజెక్టులో అధిక వాణిజ్య స్థలాన్ని పొంది.. దాన్ని లీజుకు ఇవ్వడం ద్వారా తన పెట్టుబడిని వెనక్కి తీసుకుంటాడు. రాయదుర్గం భూమిలో నిర్మించిన మొత్తం 27 లక్షల చదరపు అడుగుల బిల్డప్ ఏరియా మాల్ లో ప్రభుత్వానికి దక్కేది 9.18 లక్షల చదరపు అడుగులు మాత్రమే. కానీ ఈ టెండర్ తగ్గించుకున్న సంస్థ వంశీరాం బిల్డర్స్, అపర్ణ ఇన్ఫ్రా నిబంధనల ప్రకారం కనీసం 18 లక్షల చదరపు అడుగుల వాణిజ్య స్థలాన్ని పొందుతోంది. ప్రైవేటు వ్యాపారికి ప్రభుత్వ వాటా కంటే రెట్టింపు వాణిజ్య హక్కులు ఏ ప్రాతిపదికన కల్పించారు అనేది కేటీఆర్ ప్రశ్న. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను ప్రైవేటు డెవలపర్ కు కట్టబెట్టేలా టెండర్ ఫ్రేమ్ వర్క్ డిజైన్ చేశారని.. ప్రాజెక్టు కన్సల్టెన్సీ, సర్వేల పేరుతో అప్పటికి అయిన ఖర్చులను ఇందులో సర్దుబాటు చేయడానికి అనుమతించడాన్ని తప్పు పడుతున్నారు కేటీఆర్. అయితే నిబంధనల ప్రకారమే ఓపెన్ టెండరింగ్ నిర్వహించామని చెబుతోంది తెలంగాణ ప్రభుత్వం. అంతా పారదర్శకంగా కేంద్ర నిబంధనల ప్రకారమే టెండర్ ప్రక్రియ జరిగిందని.. దీన్ని కూడా వివాదాస్పదం చేయడం ఏంటనేది అధికార పార్టీ నుంచి వస్తున్న వాదన. కానీ ప్రజల్లో ప్రతి ప్రాజెక్టుపై అనుమానాలు రేకెత్తించడమే టార్గెట్ గా కేటీఆర్ ఈ ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

# చరిత్రలో నిలిచిపోయేలా గోదావరి పుష్కరాలు!

ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. అత్యాధునిక సాంకేతిక వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఏపీలో కూటమి ప్రభుత్వం సన్నాహాలు మరింత ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గ్లోబల్ స్టాండర్డ్స్ కు తగినట్టు ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకుగాను భారీగా ఖర్చు చేస్తోంది. మొత్తం అంచనా వ్యయం రూ.8500 కోట్లు కాగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.

**శాఖల వారిగా నిధుల కేటాయింపు...**

గోదావరి నది తీరం పొడవున 238 పుష్కర్ ఘాట్ల నిర్మాణం చేస్తోంది ఏపీ ప్రభుత్వం. శాఖల వారీగా నిధుల కేటాయింపు పై దృష్టి పెట్టింది. అయితే పాత పుష్కర ఘాట్లతో పాటు కొత్త వాటి నిర్మాణం కూడా జరపనుంది. పాతవాటికి ఆధునీకరణ, మరమ్మత్తులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ. 210.6 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ పనుల నిమిత్తం



పురపాలిక పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు, గోదావరి తీరంలో నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. వీటితోపాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, పర్యాటక సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల కోసం 10 కోట్ల రూపాయలను విడుదల చేశారు.

**డిజిటల్ టెక్నాలజీ..**

గత అనుభవాల దృష్ట్యా మరోసారి అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాదిమంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సిసిటీవీ నెట్వర్క్, డ్రోన్ సర్వే లైన్స్, రియల్ టైం కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. పుష్కర స్నానాలకు సంబంధించి ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ను, యువర్ కోడ్ నావిగేషన్ సిస్టంను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**నీరు కలుషితం కాకుండా..**

ప్రధానంగా ప్రభుత్వం నది జలాలు కలుషితం కాకుండా చూడాలని చూస్తోంది. పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీటవేస్తోంది. నదిలో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫెడరేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేస్తోంది. ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. ప్రతిఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీంలు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది, స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేసేలా ఏర్పాటు చేయనున్నారు.. మొత్తానికి అయితే గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఏర్పాట్లు చేస్తుండడం విశేషం.

# మరింత మందికి చేయూత

దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులతో పాటు ఫైలేరియా, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వంటి వ్యాధులతో బాధపడుతున్న అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయనున్నారు.

**మళ్లీ దరఖాస్తు అవసరం లేదు...**

రాష్ట్రంలో గతంలో ప్రజాపాలన కార్యక్రమాలు, ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణి వంటి కార్యక్రమాల్లో పింఛన్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసి ఉండి.. అవసరమైన సర్టిఫికెట్లను సమర్పించిన వారు మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు దరఖాస్తు చేయనివారు లేదా గతంలో దరఖాస్తులు చేసినప్పటికీ సరైన సర్టిఫికెట్లు సమర్పించని వారు మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. దరఖాస్తుతోపాటు వితంతువులు తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఒంటరి మహిళలు సెపరేషన్ సర్టిఫికెట్ లేదా లోకల్ ఎంక్వైరీ రిపోర్టు ఇవ్వాలి. గీత కార్మికులు ఎక్సైజ్ శాఖ వెరిఫికేషన్, చేనేత కార్మికులు సంబంధిత చేనేత-జౌళి శాఖ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తులకు సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలి.



**ఈ నెలాఖరు వరకే దరఖాస్తులకు గడువు**

కొత్తగా పింఛన్ అర్హత పొందినవారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దరఖాస్తుల వివరాలను పొందిన వెంటనే చేయూత ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేస్తారు. అనంతరం క్షేత్రస్థాయి విచారణ పూర్తిచేసి అర్హుల జాబితాను జిల్లా అధికారులకు పంపిస్తారు. జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తవుతుంది. ఇక ఒంటరి మహిళలు, వితంతువుల దరఖాస్తు, సర్టిఫికేషన్ల విషయంలో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు సహకరించనున్నాయి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ విషయంలో మధ్యవర్తులను నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

## ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

**పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి**

**మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**

హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ పక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు



హైదరాబాద్,ఆగస్ట్11 :నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఆక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది నిజమో కాదో అన్నది యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలోహైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు.

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

## ఆక్వారంగం చంద్రబాబు మానసపుత్రిక

**వైసిపి హయాంలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు**

**పాలకొల్లు సభలో మంత్రి అచ్చన్నాయుడు**



భీమవరం: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి 'అక్వా రంగం' మానస పుత్రిక అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం పాలకొల్లులో అక్వా సభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారంటూ ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించి, మన రాష్ట్రం పేరు చెబితే అందరూ అసహ్యించుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి ఉందని వివరించారు. ప్రస్తుతం మన రాష్ట్రం వెంటిలేటర్ నుంచి ఆక్సిజన్ పీల్చుకునే స్థాయికి వచ్చామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తుందని చెప్పారు. 2019లో ఆవేశానికి లోనై ఓ దొంగను, ఓ దోపిడీదారుడిని, ఓ గొడ్డలి పార్టీని అధికారంలోకి తెచ్చారని అన్నారు. గొడ్డలి పార్టీకి స్వేచ్ఛ ఇస్తే.. రాజ్యాంగాన్ని గౌరవించి అధికారం ఇస్తే సర్వ నాశనం చేశాడంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఇటువంటి పార్టీ పట్ల భవిష్యత్‌లో జాగ్రతగా ఉండకపోతే.. తీవ్ర ఇబ్బందులు పడతామని ప్రజలను ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు హెచ్చరించారు. ఆక్వా రంగాన్ని నాశనం చేసిన వ్యక్తి, పరామర్శ పేరుతో రైతుల దగ్గరకు వస్తే, ప్రశ్నించాల్సిన బాధ్యత మీపై లేదా? అని ప్రజలను ఆయన సూటిగా ప్రశ్నించారు. జగన్ హయాంలో అక్వా ఫీడ్‌కు అవసరమైన వస్తువుల ధరలు పెరగక పోయినా.. వాటి ధరలు ఆరు సార్లు పెంచారని చెప్పారు. త్వరలో ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ ధరలను 50 శాతం తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అదే జరిగితే అక్వా ఫీడ్ ధరలు తగ్గుతాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.పాలకొల్లులో వేలాది మంది ఆక్వా రైతుల సమక్షంలో సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి జీవో నెం.57 విడుదల చేయడం ఒక చారిత్రాత్మక ఘట్టం అని అచ్చన్నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి దిశానిర్దేశంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, ప్రధానమంత్రి మోదీ ఆశీస్సులతో ఆక్వా రైతులకు ఇచ్చిన కీలక హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. జోన్, నాన్‌జోన్‌తో సంబంధం లేకుండా, పదెకరాల పరిమితి లేకుండా అర్హులైన ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకే అందిస్తూ రైతుల సమక్షంలోనే జీవో విడుదల చేశాం అన్నారు.గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఆక్వా విద్యుత్ సబ్సిడీకి కేవలం రూ.724 కోట్లు ఖర్చు చేస్తే, మన కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే విద్యుత్ సబ్సిడీ కోసం రూ.1,150 కోట్లు కేటాయించి రైతుల పట్ల మనకున్న కట్టుబాటును చాటుకుందన్నారు..2014-19 మధ్య ఆక్వా రంగంలో సాధించిన వృద్ధిని మళ్లీ పునరుద్ధరించి, సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను బ్లూ ఎకానమీలో దేశానికే ఒక రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యతను మన ప్రభుత్వం తీసుకుంటుంది.

## ఎయిడ్స్ రహిత తెలంగాణ లక్ష్యం

**నేడు హైదరాబాద్‌లో అవగాహనా ర్యాలీ**

**వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్: ఎయిడ్స్ రహిత తెలంగాణ తమ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణెళి లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించ కుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

## మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

**జోవీ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది.

## జనగణమన తరహాలో వందేమాతరం

**చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం**

న్యూఢిల్లీ: భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది.÷రిత్త చట్టం ప్రకారం 'వందేమాతరం' గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం.




క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్





పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామా మూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం

# ఎవరి కోసం వీరి ఆందోళనలు?

వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి.ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

# అంతరంగపు రాగం.. అధికారపు వేషం!

**మనిషి హృదయం ఒకటే అయినా, అతడు సమాజంలో వ్యక్తమయ్యే వేదికలు, ఎంచుకునే మార్గాలు పూర్తి విరుద్ధంగా దర్శనమిస్తున్నాయి. ఒకవైపు లలిత కళారూపమైన పాటలో మనిషి తన నిర్మలమైన అంతరంగాన్ని నిష్కల్మషంగా, నిజాయితీగా ఆవిష్కరిస్తాడు. మరోవైపు ప్రజాస్వామిక రంగమైన రాజకీయాల్లోకి వచ్చేసరికి అదే మనిషి వందల కొద్దీ కపట ముసుగులు ధరిస్తాడు. ఇది కేవలం కాకతాళీయంగా జరుగుతున్న పరిణామం ఏమీ కాదు, మన సమకాలీన సమాజపు అంతర్లీన వైరుధ్యాలకు ఇది ప్రత్యక్ష నిదర్శనం.**

పాట పుట్టేది ఆర్ద్రత నిండిన హృదయ లోతుల నుంచి అయితే, అధికారం పుట్టేది వ్యక్తిత్వంలోని సంకుచిత అహంకార అంచుల నుంచి. ఈ రెంటి మధ్య తరతరాలుగా నిరంతరం సాగుతున్న అంతర్మథనమే నేటి చర్చనీయాంశం.తెలుగు సమాజపు చారిత్రక పరిణామ క్రమంలో వెలువడిన ప్రతి గొప్ప గేయాన్ని లోతుగా పరిశీలిస్తే, అందులో ఒక ఉదాత్తమైన మానవీయ కోణం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాచీన కాలంలో వేమన రాసిన ప్రజా పద్యాలు నిరాడంబరమైన జీవన శైలిని, సమాజంలో సమానత్వ ఆవశ్యకతను బోధించాయి. నాదబ్రహ్మ త్యాగరాజ స్వామి భక్తి కీర్తనలు మానసిక ప్రశాంతతను, నిస్వార్థమైన శరణాగతిని సమాజానికి చాటిచెప్పాయి. మహాకవి శ్రీశ్రీ కలం నుంచి జాలువారిన విప్లవాత్మక అక్షరాలు పీడిత ప్రజల కోసం సమసమాజ కాంక్షను రగిల్చాయి. ప్రజా యుద్ధనౌక గద్దర్ వంటి కళాకారుల గళం అణగారిన వర్గాల జీవన పోరాటాలకు సజీవ గొంతుకగా నిలిచింది. మరోవైపు వెండితెర సినీ గేయ రచయితలు సైతం అనురాగం, స్నేహం, త్యాగం, మానవ సంబంధాల విలువలను భావోద్వేగాల మేళవింపుతో పాటల్లో నిక్షిప్తం చేశారు.ఈ గేయాలన్నింటిలో ఒకే ఒక మౌలిక లక్షణం దాగి ఉంది. అవి ఏనాడూ వ్యక్తిగత అధికారం కోసమో, స్వార్థ ప్రయోజనాల కోసమో పుట్టలేదు, కేవలం సమాజ అంతరాత్మ ఘోషను ప్రతిబింబించడానికి ఉద్భవించాయి. కవి లేదా రచయిత తనకంటూ ఎలాంటి లబ్ధిని ఆశించకుండా, లోకం బాగుపడాలనే తపనతోనే అక్షరాలను పేర్చుతాడు. అందువల్లనే పాట ఎల్లప్పుడూ మనుషులను దగ్గరకు చేరుస్తుంది తప్ప, ఎన్నడూ విడదీయదు. పాటకు అసమానమైన ఒక అద్భుత శక్తి ఉంది. కులం, మతం, వర్గం, ప్రాంతీయ విభేదాలను సమూలంగా అధిగమించి సమస్త జనుల హృదయాలను ఒకే భావోద్వేగపు తీగపై కంపింపజేసే మహోన్నత సత్తా పాటకు మాత్రమే సొంతం. ఒక కన్నతల్లి లాలిపాటలో స్వచ్ఛమైన ప్రేమ, ఒక విప్లవ గేయంలో నిరంకుశత్వంపై నిరసన, ఒక భక్తి కీర్తనలో నిస్వార్థ శరణాగతి కనిపిస్తాయి. ఇవన్నీ మానవ అంతరంగపు విభిన్న కోణాలే. పాట ఎప్పుడూ ఒక వ్యక్తిని మనిషిగానే గౌరవిస్తుంది తప్ప, ఓటు బ్యాంకుగా పరిగణించదు.అదే సమాజంలో, రాజకీయ ముఖచిత్రంలోకి అడుగుపెడితే సమస్త వాతావరణం పూర్తిగా మారిపోతుంది. ఎన్నికల ముందు సామాన్యుడి గడప తొక్కి ప్రజాసేవ చేస్తామంటూ మైకుల్లో ఇచ్చే ఆర్భాటపు నినాదాలు, గెలిచిన మరుక్షణమే మొదలయ్యే స్వార్థపూరిత అధికార కుమ్ములాటలు నేటి రాజకీయ యవనికపై నిత్యకృత్యంగా మారాయి. నాయకుడు ఎల్లప్పుడూ ప్రజల హితం కోసమే శ్రమిస్తున్నానని నిత్యం ప్రకటనలు గుప్పిస్తుంటాడు. కానీ అతని ప్రతి అంతర్గత ఆలోచన, తీసుకునే ప్రతి విధానపరమైన నిర్ణయం వెనుక తన అధికార పీఠాన్ని, కుర్చీని కాపాడుకునే రాజకీయ చదరంగపు ఎత్తుగడలు దాగి ఉంటాయి. ప్రచార వేదికలపై కురిపించిన ఆకర్షణీయమైన వాగ్దానాలు గాలిలో కలిసిపోతుంటే, క్షేత్రస్థాయి వాస్తవాలు మరియు ప్రజాసమస్యలు అధికార సౌధాల గదుల్లో శాశ్వతంగా మరుగున పడిపోతున్నాయి.

రాజకీయాల్లో అధికారం అనేది అత్యంత ప్రమాదకరమైన ఒక మత్తు పదార్థం లాంటిది. అది ఒక నాయకుడిలో ఉండవలసిన సహజమైన వినమ్రతను క్రమంగా హరించివేస్తుంది. తనకంటే గొప్పవారు, తనకంటే బలవంతులు ఈ సమాజంలో ఎవరూ లేరన్న అహంకారపూరిత భ్రమను పాలకులలో నింపుతుంది. అందుకే ఎంతోమంది రాజకీయ నాయకులు అధికారంలోకి రాకముందు ఉన్నతమైన ఆదర్శాలు, నైతిక విలువల గురించి వేదికలపై అనర్గళంగా మాట్లాడతారు; పదవి చేజిక్కగానే తాము చెప్పిన ఆదర్శాలన్నింటినీ గాలికొదిలేస్తారు. ఇక్కడ ప్రజలు గమనించవలసిన అసలైన తాత్విక అంశం ఏమిటంటే అధికారం కొత్తగా ఎవరినీ భ్రష్టుపట్టించదు; అది వ్యక్తి మనసులో నిద్రాణమై ఉన్న నైజమైన స్వార్థాన్ని నిస్సిగ్గుగా సమాజం ముందుకు లాగుతుంది. అధికారం ఒక నిర్మలమైన అద్దం లాంటిది; అది పాలకుడి అసలుసిసలైన నైతిక రూపాన్ని పచ్చిగా ప్రతిబింబిస్తుంది.పాటకు, రాజకీయానికి మధ్య ఇంతటి అగాధం ఎందుకు నెలకొంది? పాట స్వతహాగా



నిస్వార్థమైనది. అది హృదయపూర్వకంగా పంచడమే తప్ప, ప్రతిఫలంగా ఏమీ ఆశించదు. కానీ రాజకీయం అనేది మూలంలోనే ఒక తీవ్రమైన ఆధిపత్య పోటీ వ్యవస్థ. కేవలం విజయం, అధికారం, శాసించే హోదా అనే తాత్కాలిక లక్ష్యాలతోనే రాజకీయం నడుస్తుంది. ఈ సంకుచిత కాంక్షలు మనిషిని ప్రాథమిక మానవత్వపు విలువల నుండి శరవేగంగా దూరం చేస్తాయి. కళాకారుడు సమాజాన్ని తన కుటుంబంగా భావించి ఆర్తితో పాడుతాడు; రాజకీయవేత్త సమాజంలోని మనుషులను చూసి ఓట్ల కూడికలు, తీసివేతల లెక్కలు వేస్తాడు. కళ సున్నితమైన అంతఃకరణతో సంభాషిస్తే, రాజకీయం కేవలం మెదడుతో కుయుక్తుల వ్యూహాలు రచిస్తుంది. అయితే చరిత్రలో ప్రజాసేవనే పరమావధిగా భావించి పాలించిన మహనీయులు కూడా లేకపోలేదు. కానీ వర్తమాన కాలంలో అటువంటి నిబద్ధత కలిగిన రాజనీతిజ్ఞులు అత్యంత అరుదైపోయారు. అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక గమ్యమైనప్పుడు, మానవతా విలువలు మార్గమధ్యంలోనే బలిపీఠం ఎక్కుతున్నాయి.ఈ చారిత్రక వైరుధ్యానికి అసలైన పరిష్కారం రాజకీయ ప్రక్రియను విడనాడటంలో లేదు, పాటల్లో వెల్లివిరిసే పవిత్రమైన మానవీయ స్ఫూర్తిని పాలనారంగంలోకి తీసుకురావడంలోనే దాగి ఉంది. ప్రజాప్రతినిధి అయినవాడు రాజ్యాంగబద్ధమైన అధికారాన్ని కేవలం ఒక పవిత్ర బాధ్యతగా స్వీకరించాలే తప్ప, శాసించే అనుభవపూర్వక హక్కుగా పరిగణించరాదు. అధికారం అంటే నిస్వార్థంగా ప్రజాసేవ చేయడానికి లభించిన ఒక మహత్తర అవకాశమని పాలకులు గ్రహించినప్పుడే, రాజకీయం సైతం ఒక మనోహరమైన పాటలా మారి సమాజంలోని సమస్త వర్గాలను ప్రేమానురాగాలతో ఏకం చేయగలుగుతుంది. చైతన్యవంతమైన పౌరులుగా ఓటర్లు కూడా నాయకుల మాటల వెనుక దాగివున్న కపట ఉద్దేశాలను నిశితంగా బేరీజు వేసుకోవాలి. ఒక పాటను వినేటప్పుడు మనం ఎంతటి పరిశుద్ధమైన హృదయంతో స్పందిస్తామో, రాజకీయ నాయకుల ప్రసంగాలను ఆలకించేటప్పుడు కూడా అంతే లోతైన సామాజిక విచక్షణను, చైతన్యాన్ని ప్రదర్శించాలి. నిజాయితీని, స్వార్థాన్ని వేరుచేసి గుర్తించగల వివేకాన్ని పెంపొందించుకోవడమే కళలు మనకు ప్రసాదించే ప్రథమ కర్తవ్యం.పాట అనేది సహజమైన ఆర్ద్రతతో నిండిన హృదయం లోతుల నుంచి ఉద్భవిస్తుంది, కాబట్టే అది యుగయుగాల పాటు మానవాళి నాల్కలపై చిరంజీవిగా జీవిస్తుంది. కానీ అధికారమనేది స్వార్థపూరిత అహంకారపు పొరల నుంచి పుడుతుంది, కాబట్టే అది ఒక్క ఐదేళ్ల ఎన్నికల తీర్పుతోనే అగాధంలోకి కలిసిపోతుంది. ఈ రెండింటి మధ్య ఉండే అగాధమే సమస్త ప్రపంచానికి ఒక సార్వకాలిక సత్యాన్ని ప్రబోధిస్తోంది. నిరంతర శాశ్వతత్వం అనేది నిస్వార్థమైన మానవతా విలువల్లోనే నిక్షిప్తమై ఉంది తప్ప, క్షణికమైన అధికార దర్పంలో ఎంతమాత్రం లేదు. ఆధునిక సమాజం సమగ్రమైన ప్రగతి పథంలో పయనించాలంటే, పాలకులైనవారు పదవీ వ్యామోహాన్ని వీడి, పాటలోని నైతిక సౌరభాన్ని ఆచరణలో పెట్టాలి. పాట మనిషిని ఉన్నతుడిగా నిలబెడితే, పదవీలాలస మనిషిని భ్రాంతిలో ముంచుతుంది. ఈ ప్రాథమిక సత్యాన్ని ఆకళింపు చేసుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్య వికాసం సుసాధ్యమవుతుంది.



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

# ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

## సైనిక విమానంలో ట్రంప్ రహస్య ప్రయాణం

## 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనం

వాషింగ్టన్,ఆగస్ట్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో టర్కీ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తున్నప్పుడు బ్రిటన్ కు అత్యంత రహస్యంగా ప్రయాణించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల భయంతో ఆయన అందరూ భావించినట్లు ఎయిర్‌ఫోర్స్ వన్‌లో కాకుండా మరో సైనిక విమానంలో రహస్యంగా ప్రయాణించారని ఆ కథనం పేర్కొన్నది. వివరాల్లోకి వెళ్తే.. టర్కీ రాజధాని అంకారాలో నాటో సదస్సు ముగిశాక ట్రంప్.. కెమెరాల ముందు పాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కారు. అయితే ఆ తర్వాత ఆయనను ఒక ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు ద్వారా రహస్యంగా మరోచోట ఉన్న చిన్న సైనిక విమానం (ఎయిర్‌ఫోర్స్ సి-32ఏ) వద్దకు తరలించారు. ఆ విమానంలోనే ఆయన బ్రిటన్‌కు చేరుకున్నారని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. ట్రంప్ ప్రయాణిస్తున్నట్లు అందరూ భావించిన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం కూడా కొన్ని నిమిషాల తేడాతో అక్కడికి చేరుకుంది. పాత జ్ఞాపకాల కోసం ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేసినప్పటికీ అసలు కారణం ఇరాన్ నుంచి పొంచి ఉన్న భద్రతా ముప్పేనని స్పష్టమవుతోంది. ఈ కథనంపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. 'అధ్యక్షుడిపై అమెరికా శత్రువులు కన్నేశారు.

# ఆంక్షల వ్యసనంలో అమెరికా

## దౌత్య మార్గంలో విఫలంతో ఆంక్షల కొరడా

## ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయిూ

టెహ్రాన్,ఆగస్ట్11 : తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయిూ విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసు కోవడం సాధ్యం కాదని బఘాయిూ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు. ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు.

# విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తికి కొడాల ప్రోత్సాహం

## చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యత.. పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

## సేవా కార్యక్రమాల్లో మరో అడుగు.. చిన్నారుల కోసం సర్పంచ్ కొడాల ఉదారత

## కొడాల బ్రదర్స్ సేవా స్ఫూర్తికి మరో నిదర్శనం.. విద్యార్థులకు అండగా నిలిచిన వెంకట్ రెడ్డి






**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** సేవా కార్యక్రమాలకు మారుపేరుగా నిలుస్తున్న కొడాల బ్రదర్స్, మరోసారి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రజా సేవలో ముందుంటూ, అవసరమైన వారికి అండగా నిలుస్తున్న, కొడాల వెంకట్ రెడ్డి, ఆయన సోదరుడు అల్వాల్ రెడ్డి తమ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థుల అభివృద్ధికి కూడా, తనవంతు సహకారం అందిస్తూ సర్పంచ్ కొడాల వెంకట్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థుల కోసం, రాజాపేట తండా సర్పంచ్ కొడాల వెంకట్ రెడ్డి తన సొంత ఖర్చుతో, వివిధ ఆట వస్తువులను కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, అవసరమైన క్రీడా సామగ్రితో పాటు ఆట స్తంభాలు, నెట్ తదితర వస్తువులను అందించడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు."విద్యార్థుల భవిష్యత్తు కేవలం చదువుతోనే కాదు.. క్రీడలు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో కూడా ముడిపడి ఉంటుందనే ఆలోచనతో, కొడాల వెంకట్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముందుకొచ్చారు. చిన్నారులకు సరైన క్రీడా వసతులు కల్పిస్తే వారిలో ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తించడమే కాకుండా, విద్య, వైద్యం, పేదల సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి వంటి సామాజిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, సేవా కార్యక్రమాలు చేపట్టడం కొడాల వెంకట్ రెడ్డి ప్రత్యేకతగా నిలుస్తోంది. అవసరమైన చోట తనవంతు సహాయం అందిస్తూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం క్రీడా సామగ్రిని అందించడం ద్వారా, కొడాల వెంకట్ రెడ్డి మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలకు, ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల సిబ్బంది అభిప్రాయపడుతూ, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న సర్పంచ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న, కొడాల బ్రదర్స్ ఖాతాలో మరో సేవా కార్యక్రమం చేరిందని, ప్రజా సేవలో వారి కుటుంబం చూపిస్తున్న చొరవ స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఒడిబియ్యం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న కొలుకుల జైహింద్






**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,రోడా మేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ లోని అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.ఆర్.ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నిర్వహించిన ఒడి బియ్యం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జైహింద్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో బస్తీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంప్రదాయంలో అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధిగాంచినవని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, నర్సింగ్, సంతోష్, మురళి, ప్రభాకర్, నాగరాజు, యాదగిరి, విగ్నేష్, సీతారాములు, ఖయ్యూం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
## కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595





# ప్రజాబాటలో విద్యుత్ అంతరాయాల నివారణకు చెట్ల కొమ్మల తొలగింపు

## తానిషా కాలనీలో విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా 127--మణికొండ డివిజన్‌లోని తానిషా కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం విద్యుత్ శాఖ డిఇ రమేష్ చంద్ర, ఎడిఇ సైదులు, ఎ ఇ సంతోష్ ఆధ్వర్యంలో సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడం వల్ల తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉండటంతో ముందస్తుగా వాటిని తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు శాఖ అధికారులు చేపడుతున్న ముందస్తు చర్యలు అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపడమే ప్రజాబాట కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తానిషా కాలనీ వాసులు విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వల్ల విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐసిసి కోఆర్డినేటర్ నుమాన్, తానిషా కాలనీ సొసైటీ అధ్యక్షులు సీతారామదాస్, సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షులు వంశీ తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**క్రైమ్ మిర్రర్,పాలకీడు :** లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో యల్లాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్స్, చూచిరాత నోట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు షేక్ అబూబకర్ సిద్ధిక్ ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఇంజమూరి కాటయ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల్లో చక్కని చేతిరాతను పెంపొందించేందుకు హ్యాండ్ రైటింగ్ శిక్షకులు నలబోలు జగదీశ్ రెడ్డి ప్రత్యేక సూచనలు అందించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన నోట్స్, చూచిరాత నోట్స్ అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపకరించే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, సహ ఉపాధ్యాయులు గంధం ధర్మరాజు, వాలంటీర్లు సమీనా, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# బాలుడు అదృశ్యం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మొబైల్ ఫోన్ విషయంలో తల్లితో జరిగిన గొడవ అనంతరం 11 ఏళ్ల బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన శంషాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం డ్రీమ్ అవెన్యూ ప్రాంతానికి చెందిన ఇబ్రహీం మొల్లా ఆగస్టు 10న రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అదృశ్యమైన బాలుడి ఎత్తు సుమారు 4.5 అడుగులు ఉండగా, నలుపు వర్ణంతో ఉంటాడని పోలీసులు తెలిపారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో నీలం రంగు టీషర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. బాలుడికి హిందీ, బెంగాలీ భాషలు మాట్లాడటం వచ్చునని తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌కు 8712663319, ఎస్ఐ 8712663311 సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# అత్తాపూర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై సమావేశం

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

## చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి


**గండిపేట(క్రైమ్ మిర్రర్):** హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో అత్తాపూర్ డివిజన్‌లో సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో హైదర్‌గూడలో జరిగిన ఈ సమావేశానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి చాటాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని సూచించారు. అలాగే డివిజన్ పరిధిలో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి భావనను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఆఫీస్ సెక్రటరీ విజయ్ కుమార్, సిద్దేశ్వర్ జీ, రాజు, అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, అనురాధ, శివరాజ్ గౌడ్, సతీష్, శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, మణికంఠ, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎల్ఆర్ఎస్ అమలుపై శంషాబాద్ జోన్‌లో సమీక్ష సమావేశం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ జోన్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కుమారి కె. చంద్రకళ ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్ అమలు, ఫీజు వసూళ్ల వేగవంతం, అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని ఆదిబట్ల సర్కిల్--15, బడంగ్‌పేట్ సర్కిల్--16, జల్‌పల్లి సర్కిల్--17 మరియు శంషాబాద్ సర్కిల్--18కు చెందిన వార్డు అధికారులతో సమావేశం నిర్వహించి, ఆయా సర్కిళ్లలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులు, పెండింగ్ దరఖాస్తులు, ఫీజు చెల్లింపులు, ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియపై జోనల్ కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కె. చంద్రకళ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హత కలిగిన దరఖాస్తుదారుల నుంచి లిఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఫీజు చెల్లించిన అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్‌ను ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని, మొత్తం ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వార్డులో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ కేసులను వార్డు వారీగా సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందిస్తూ, వారి సందేహాలు మరియు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ కె.ఎన్. మెహ్రా, శంషాబాద్ జోన్‌కు చెందిన అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఛార్జీలపై 25 శాతం రాయితీ...లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద చెల్లించాల్సిన ఫీజులు, ఛార్జీలపై ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పిస్తోంది. ఈ రాయితీ 2026 ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు అందుబాటులో ఉంటుంది. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన ఫీజులు, ఛార్జీలను ఈ గడువులోగా చెల్లించే వారికి 25 శాతం రాయితీ వర్తించనుంది. అర్హత కలిగిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు .



## రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆషాఢ బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని శంషాబాద్‌లోని గాశి మియాగూడలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ టి. ప్రకాష్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయానికి వచ్చిన భక్తులతో కలిసి ఆషాఢ బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు స్వాగతం పలికారు. ఆషాఢ బోనాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో సందడి నెలకొంది.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

### బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి-2 డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం -- ప్రతి హృదయంలో దేశభక్తి అనే నినాదంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి భావంతో నిర్వహించనున్నట్లు బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి-2 డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి తెలిపారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ మైలార్‌దేవ్‌పల్లి-2 డివిజన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యత, అఖండ భారత స్ఫూర్తిని ప్రజల్లో మరింత పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, యువతతో పాటు దేశభక్తి కలిగిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జోగి రవి, ఏ. రాజు, ఏ. మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, గూడూరి అంజి, కొండల, సురేశ్ యాదవ్, నవీన్, రాతిక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

### లేకుంటే అసెంబ్లీ ముట్టడికి సిద్ధం- తపస్






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సభ్యత్వ అభియాన్‌లో భాగంగా రాజేంద్రనగర్ మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు లను కలిసి సంఘం లక్ష్యాలు, ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తపస్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఆర్సీ అమలు, 6 డీఏలు విడుదల, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్, శ్రీకాంత్, మండల కార్యదర్శి శివతో పాటు పలువురు తపస్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వర్షాకాలం లో రాజేంద్రనగర్ జోన్ పరిధిలో

# ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు





### జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్ వీ కర్ణన్ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ జోనల్ పరిధిలో ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్ ను ఏర్పాటు చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిళ్లలో గల 29వార్డులలో మంగళవారం నుంచి ఈ నెల 21 వ తేదీ వరకు దశల వారీగా మాన్సూన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పారిశుధ్య విభాగం లో 54 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను, 18.5 మెట్రిక్ టన్నుల సీ అండ్ డీ వ్యర్థాలను తొలగించటం జరిగిందన్నారు. పట్టించుకోకుండా వదిలివేయబడిన రెండు వాహనాల తరలించటానికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. 52 గృహాలను స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణకు అనుసంధానం చేశామన్నారు. అక్రమంగా కన్ స్ట్రక్షన్ , డెమోలిషన్ ( సీ అండ్ డీ) వ్యర్థాలు డంప్ చేసిన వారికి జరిమానా విధించబడుతుందని అని హెచ్చరించటం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా జోన్ పరిధిలోని వార్డుల్లో టౌన్ ప్లానింగ్ విభాగం నందు 12- గేటెడ్ కమ్యూనిటీలు, హై-రైజ్ భవనాల్లో పిట్ హాటరీల్స్ (నీటి నిల్వ/వర్షపు నీటి పారుదల గుంతలు) సక్రమంగా పనిచేస్తున్నాయా అనే అంశంపై సర్వే నిర్వహించబడిందన్నారు .రెసిడెన్షియల్ భవనాల సర్వే పూర్తి చేయటం, ఇంజినీరింగ్ విభాగం నందు రోడ్డు పైన గల 29 గుంతలని పూడ్చటం, 28 ఇంకుడు గుంతలని శుభ్రం చేయటం, 1.5 మెట్రిక్ టన్నుల సిల్ట్/ఫ్లోటింగ్ మెటీరియల్ను తొలగించటం జరిగిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు . ఇందులో భాగంగా 3109 గృహల నందు యాంటి లార్వా ఆపరేషన్ స్ కార్యకలాపాలు, 12 ప్రాంతాలలో ఫాగింగ్ నిర్వహించడంజరిగిందన్నారు. 6 ప్రదేశాలలో ఐ ఈ సీ కార్యక్రమాలు చేపట్టడం, 11 విధి కుక్కలను పట్టు కోవటం, 13 కుక్కలకు వ్యాక్సినేషన్ చేయటం, 14 కుక్కలను షెల్టర్ హటరీమ్స్ కు తరలించటం జరిగిందన్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో 93 మంది సభ్యులు పాల్గొన్నారు. 795 మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ పూర్తి చేయటం జరిగిందన్నారు . అర్బన్ బయోడైవర్సిటీ డిపార్ట్ మెంట్ నందు రాజేంద్రనగర్ జోన్ పరిధిలో 5.5 మెట్రిక్ టన్నుల కత్తిరించిన చెట్ల కొమ్మలను తొలగించటం, పార్కుల నుంచి 1.5 మెట్రిక్ టన్నుల పొడి/తడి వ్యర్థాలను తరలించారన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ జీహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించి ప్రత్యేక డ్రైవ్ ను విజయవంతం చేయాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## సైబరాబాద్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేత పిడికిటి గోపాల్ చౌదరి

### ప్రజా సమస్యలు, శాంతిభద్రతల అంశాలపై సీపీ రమేష్ రెడ్డితో చర్చ



**కూకట్‌పల్లి, ఆగస్టు 11 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిడికిటి గోపాల్ చౌదరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు అంశాలతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించిన వివిధ విషయాలపై సీపీతో గోపాల్ చౌదరి చర్చించినట్లు తెలిపారు. ఈ భేటీలో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రత కల్పించడం తదితర అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నట్లు సమాచారం. ప్రజల సమస్యలను పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగినట్లు గోపాల్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ రెడ్డి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను వివరించినట్లు తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం సీపీ రమేష్ రెడ్డిని పిడికిటి గోపాల్ చౌదరి శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీకి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగినట్లు గోపాల్ చౌదరి పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలు, స్థానిక సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా గోపాల్ చౌదరి తెలిపారు.

## గ్రీన్ సిటీ కాలనీలో మహిళ అదృశ్యం



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,ఏప్రిల్ 11;** గ్రీన్ సిటీ కాలనీలో 38 ఏళ్ల మహిళ అదృశ్యమైన ఘటనపై హయత్నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. బొర్రాత్ సాయిబాబాకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె లక్ష్మీ (38)కి బాలకృష్ణతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే బాలకృష్ణ 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మీ తన ఇద్దరు కుమారులతో కలిసి తండ్రి సాయిబాబా ఇంట్లోనే నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆగస్టు 9, 2026న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో లక్ష్మీ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్ల వద్ద కూడా వెతికారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో లక్ష్మీ తండ్రి సాయిబాబా హయత్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

# పంచవటి కాలనీలో జోనల్ కమిషనర్ పర్యటన

## మౌలిక వసతులు, రోడ్లు, ట్రాఫిక్ సమస్యలపై స్థానికుల వినతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పంచవటి కాలనీ, వార్డు 127లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సెరిలింగంపల్లి జోనల్ కమిషనర్ మంగళవారం పర్యటించారు. కాలనీ ప్రవేశ ద్వారం వద్ద స్థానికులను కలిసి, కాలనీలో నెలకొన్న మౌలిక వసతులు, రోడ్లు, ట్రాఫిక్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మణికొండ నాయకుడు సీతారాం ధూళిపాల ఆధ్వర్యంలో స్థానికులు పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో రోడ్ల సామర్థ్యం, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలను మెరుగుపరచకుండా కొత్త వాణిజ్య సంస్థలకు అనుమతులు ఇవ్వకూడదని కోరారు. అలాగే పంచవటి కాలనీలో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఓయు కాలనీ--మర్రిచెట్టు--పంచవటి కాలనీ మీదుగా లాంకో సర్కిల్ వరకు రహదారి విస్తరణను ప్రాధాన్యతతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంచవటి కాలనీ హద్దులను సంబంధిత గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఖచ్చితంగా అమలు చేయాలని, రోడ్ నంబర్--10ను కలిపే బాక్స్ డ్రెయిన్--కమ్--రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా కాలనీ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సర్వే నంబర్ 42 ప్రభుత్వ భూమిని ఆక్రమణలు, అనధికార వినియోగం నుంచి పరిరక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను జోనల్ కమిషనర్ పరిశీలించి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు తగిన సూచనలు చేసినట్లు తెలిపారు. రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ మౌలిక వసతుల మెరుగుదల, రహదారి విస్తరణ, ప్రభుత్వ భూమి పరిరక్షణ వంటి అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధికారులు కాలపరిమితితో కూడిన చర్యలు చేపట్టాలని పంచవటి కాలనీ వాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం

## తల్లి ఫిర్యాదుతో హత్యకేసు నమోదు

రాజమహేంద్రవరం: నగరంలో శాంతినగర్‌కు చెందిన యువతి మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ కుమార్తెను దారుణంగా హత్య చేశారని ఆమె తల్లి జ్యోతి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోటిలింగాలపేటకు చెందిన అభిలాష్ సర్జికల్ బ్లేడుతో దాడి చేసి చంపాడని అందులో పేర్కొన్నారు. మధుప్రసన్నకి జూన్ 21న మరో యువకుడితో నిశ్చితార్థం చేశాం. ఈనెల 27న వివాహం జరగాల్సి ఉంది. తననే పెళ్లి చేసుకోవాలని కొన్ని రోజులుగా అభిలాష్ వెంటపడుతున్నాడు. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటానని మధుప్రసన్న చెప్పడంతో కోపం పెంచుకున్నాడు. మాట్లాడుకుందామని మభ్యపెట్టి బైక్‌పై గామన్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ బ్లేడుతో దాడి చేశాడు. మధుప్రసన్న తప్పించుకునే ప్రయత్నం చేసే క్రమంలోనే యువకుడి చేతిపై గాయమైనట్లు అనుమానముంది. తమ కుమార్తెను దారుణంగా చంపిన అభిలాష్‌ను కఠినంగా శిక్షించాలి' అని జ్యోతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు యువకుడిపై హత్య కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం యువతి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# శ్రీ చైతన్య విద్యా సంస్థల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

## యు ఎస్ ఫ్ ఐ ఖమ్మం జిల్లా కమిటీ నిరసన -- స్పందించి బస్సును సీజ్ చేసిన ఆర్టీఓ అధికారులు





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలో శ్రీ చైతన్య విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఒకే బస్సులో 100 మందికి పైగా విద్యార్థులను ఎక్కించి వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని యుఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు సంఘం నాయకులు కలిసి బస్సును ఆపి విద్యా సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యస్ ఎస్ ఎఫ్ ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ మాట్లాడుతూ... "కార్పొరేట్ విద్యా సంస్థ అయిన శ్రీ చైతన్య, విద్యార్థుల నుండి వేల రూపాయలు బస్సు ఫీజుల రూపంలో వసూలు చేస్తూ, కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. సీటింగ్ సామర్థ్యం కంటే రెట్టింపు స్థాయిలో, సుమారు 100 మంది విద్యార్థులను ఒకే బస్సులో మేకల మందలా తరలిస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు?" అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసి, లాభాపేక్షే ధ్యేయంగా వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను సమగ్రంగా తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యు ఎస్ ఫ్ ఐ నిరసన మరియు ఫిర్యాదుకు తక్షణమే స్పందించిన రవాణా శాఖ అధికారులు, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థకు చెందిన బస్సును అక్కడికక్కడే సీజ్ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి విద్యా సంస్థపైనా అయినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యు ఎస్ ఫ్ ఐ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈల బలోపేతానికి కొత్త చట్ట సవరణలు

### సవరణ బిల్లుకు లోక్సభ ఆమోదం

### సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టానికి అనుగుణంగా సవరణలు

### సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్యాలయ సంయుక్త సంచాలకులు సి. శివ శేషగిరి రావు



**కూకట్‌పల్లి, ఆగస్టు 11 (క్రైమ్ మిర్రర్) :** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం--రెండువేల ఇరవై ఆరు సవరణ బిల్లుకు లోక్‌సభ ఆగస్టు ఏడో తేదీన ఆమోదం తెలిపింది. అంతకుముందు ఆగస్టు మూడో తేదీన రాజ్యసభ బిల్లును ఆమోదించింది. రెండువేల ఆరులో అమల్లోకి వచ్చిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టానికి ఇరవై ఏళ్లు పూర్తైన నేపథ్యంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఈ సవరణలు చేపట్టారు. మీడియాతో మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్యాలయ సంయుక్త సంచాలకులు సి. శివ శేషగిరి రావు మాట్లాడుతూ, ఈ రంగానికి బలమైన చట్టపరమైన వ్యవస్థను కల్పించడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, ఆలస్య చెల్లింపుల సమస్యలను పరిష్కరించడం, వివాదాలను వేగంగా పరిష్కరించడం వంటి లక్ష్యాలతో చట్టంలో సవరణలు చేసినట్లు తెలిపారు. సవరించిన చట్టంలో పెట్టుబడి, వార్షిక వ్యాపార లావాదేవీల ఆధారంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, ఉచితంగా స్వచ్ఛందంగా నమోదు చేసుకునే ఉద్యమ్ నమోదు వేదికకు శాశ్వత ప్రాతిపదిక కల్పించినట్లు చెప్పారు. సూక్ష్మ, చిన్న సంస్థలకు ఆలస్యమైన చెల్లింపుల సమస్య పరిష్కారానికి ఆన్‌లైన్ వివాద పరిష్కార విధానం, మధ్యవర్తిత్వం, మధ్యస్థ తీర్పు వంటి విధానాలను ప్రవేశపెట్టి, వాటికి నిర్దిష్ట కాలపరిమితులను నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల నుంచి కొనుగోలు చేసిన వస్తువులు, సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులను వాణిజ్య బిల్లుల తగ్గింపు వేదిక ద్వారా నిర్వహించేలా నిబంధనలు తీసుకువచ్చినట్లు శివ శేషగిరి రావు వివరించారు. దీనివల్ల సంస్థలకు నగదు ప్రవాహం మెరుగుపడి, సకాలంలో చెల్లింపులు అందే అవకాశం ఉంటుందని అన్నారు. అదేవిధంగా సూక్ష్మ, చిన్న సంస్థల సౌకర్యార్థం సూక్ష్మ, చిన్న సంస్థల సదుపాయ మండళ్ల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. చిన్న సంస్థలకు సంబంధించిన వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు, కొన్ని నిబంధనలను నేరపరమైన శిక్షల పరిధి నుంచి తొలగించి, హెచ్చరికలు, దశలవారీగా పౌర జరిమానాలు విధించే విధానాన్ని తీసుకురావడం ద్వారా వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమ్ వేదికలో నమోదైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు రెండువేల ఇరవై మూడు ఏప్రిల్‌లో ఒక కోటి అరవై ఐదు లక్షల నుంచి ప్రస్తుతం తొమ్మిది కోట్ల పదహారు లక్షలకు పెరిగాయని శివ శేషగిరి రావు తెలిపారు. ఈ రంగం నలభై కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తూ భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. వికసిత్ భారత్--రెండువేల నలభై ఏడు లక్ష్య సాధనలో బలమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు దశ్రత్, ఎన్. సుమతి, గుళషన్ సింగ్ బిస్ట్, గురుస్వామి, నవీన్ కుమార్, దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు

## హంతకులు నలుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడి

తిరుపతి,ఆగస్ట్11 : శ్రీకాళహస్తిలో సంచలనంగా మారిన హత్య కేసును తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆగస్టు 2న రాత్రి 7:30 గంటల సమయంలో శ్రీకాళహస్తి పీఆర్ గేట్ ప్రాంతంలో స్వర్ణముఖి నది కట్టపై శివ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. టెక్నికల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి.. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చెన్నైకి చెందిన థొప్పై గణేశన్ గ్యాంగ్‌తో నిందితులకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన బైక్, రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.



# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నూతనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో సంఘ సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేసి, పాఠశాల సమస్యలపై సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారి శ్రీనివాస్ పుప్పాల వీరన్న లు మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్సి రిపోర్టును తెప్పించుకొని 50 శాతం ఫిట్ మెంట్ తో అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డిఏ లను వెంటనే విడుదల చేయాలని కోరారు .సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, విద్యార్థులకు ఉచిత యూనిఫాములను వెంటనే అందజేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ చారి, దీకొండ మహేష్, మద్దిరాల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గంపల సాల్మన్, గంగాధర సురేష్ కుమార్, కృష్ణవేణి, పద్మం మల్లయ్య, నారాయణదాసు శ్రీనివాసు, శ్రవణ్ కుమార్, నాగేందర్, యాదగిరి, యోగానంద్, లింగయ్య,నాగరాజు, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ అలవర్చుకోవాలి.

## ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు



**కోదాడ ఆగస్టు 11 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: విద్యార్థులు తమ విద్యార్థి దశలో చదువుతో పాటు సామాజిక స్పృహ అలవర్చుకొని దేశం గర్వించే మంచి పౌరులుగా ఎదగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు అన్నారు. కోదాడ పట్టణంలోని ఎన్ ఆర్ ఎస్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై నిర్వహించిన శిక్షణ, పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక తో మంచి పౌరులుగా తయారుకావాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక విద్యార్థిలో అసమాన ప్రతిభ దాగి ఉంటుందని వాటిని సమయానుసారంగా ప్రదర్శించినపుడే విజయం వరిస్తుందని అన్నారు. విద్యార్థులకు ఎన్ ఆర్ ఎస్ విద్యాసంస్థలు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకొని విజేతలుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఆర్ఎస్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి మాట్లాడుతూ తమ విద్యా సంస్థలలో చేరిన ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి ఆసక్తి ఉన్న రంగాలలో నిష్ణాతులుగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భారతీ విద్యాసంస్థల కరస్పాండెంట్ కట్టా సత్తిరెడ్డి, ఎన్ ఆర్ ఎస్ ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ ( జీ వీ), వైస్ ప్రిన్సిపల్ పీ ఎన్ ఆర్, పీ ఆర్ వో మల్లికార్జున రావు, పలువురు టీచర్లు, కాలేజ్ లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# న్యూ విజన్ జూనియర్ కాలేజీ వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం

## పార్కింగ్ సౌకర్యం లేక రహదారిపైనే వాహనాలు.. స్థానికులకు తీవ్ర ఇబ్బందులు

## కాలేజీ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తోందని స్థానికుల ఆరోపణ

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం బైపాస్ రోడ్డులోని న్యూ విజన్ జూనియర్ కాలేజీ క్యాంపస్ వద్ద ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు ఉదయం 7:00 గంటల నుండి 8:00 గంటలు ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది వాహనాలతో బైపాస్ రోడ్డుపై రద్దీ ఏర్పడి, హైవేపై రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు. కళాశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పటికీ, వారి వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రహదారి పక్కనే, కొన్నిసార్లు ప్రధాన రహదారిపైనే నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ స్తంభిస్తోందని పేర్కొంటున్నారు. అత్యంత రద్దీగా ఉండే బైపాస్ రోడ్డులో ఈ పరిస్థితి ప్రమాదాలకు కూడా దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతతో పాటు రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన యాజమాన్యం, పార్కింగ్ సమస్యపై తగిన చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంపైనే దృష్టి పెట్టి, క్యాంపస్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా పార్కింగ్ వంటి అంశాలను పట్టించుకోవడం లేదని వారు




ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ప్రశ్నించిన స్థానికులతో కాలేజీ యాజమాన్యం సరైన రీతిలో స్పందించకుండా కాలయాపన చేస్తోందని వారు అంటున్నారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**డీఈఓ తక్షణమే స్పందించాలి**

ఈ సమస్యపై ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తక్షణమే స్పందించి న్యూ విజన్ జూనియర్ కాలేజీ పరిసరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. కళాశాలకు సరైన పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయడం, రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవడం, విద్యార్థుల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పార్కింగ్‌కు అనువైన స్థలం లేకుండా, నిత్యం ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నట్లయితే ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది కలగని ప్రత్యామ్నాయ ప్రదేశానికి క్యాంపస్‌ను మార్చే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. "విద్యాసంస్థ నిర్వహణతో పాటు ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కూడా ముఖ్యమే. అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలపై ఏర్పాట్ల సమీక్ష...!

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖలతో సమన్వయ సమావేశం
### ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు సంయవనం పాటించాలి
### శంషాబాద్ డీసీపీ రాజేష్



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం రావిర్యాలలో స్వయంభువై వెలిసిన శ్రీ సూర్యగిరి (సూరన్ గుట్ట)ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఆగస్టు ఒకవ తేదీన జరగనున్నయి, సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాల ఉత్సవం'దృష్ట్యా, మంగళ వారం షంషాబాద్ డీసీపీ రాజేష్ ధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించరూ ఈ సమావేశంలో ఆలయ ప్రాంగణంలోని ఏర్పాట్లను ముఖ్యంగా పార్కింగ్ స్థలాలు, భక్తుల కోసం భారీగేట్లు, ట్రాఫిక్ నిర్వహణ,విద్యుత్, పారిశుధ్యం మరియు ఉత్సవాలు సజావుగా సాగేందుకు అవసరమైన ఇతర ఏర్పాట్లను,పరిశీలించి సమీక్షించారు. శాంతిభద్రతల (లా) విభాగం, దేవాదాయ శాఖ, ట్రాఫిక్ పోలీస్,విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని, అవసరమైన ఏర్పాట్లపై సమన్వయ చర్యలపై చర్చించారు.బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనాన్ని సులువుగా జరిగేలా ఏర్పాట్లు చెయ్యాలని తెలిపారు..ఆలయానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.అమ్మవారి బోనాలు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలవారు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు,ఆలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# థాయిలాండ్ విద్యార్థులకు ఎపి సర్కార్ అండ

### మంత్రి లోకేశ్ ఆదేశాలతో సంప్రదించిన అధికారులు

అమరావతి: థాయ్‌లాండ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులతో ఏపీ భవన్ అధికారులు మాట్లాడారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు విద్యార్థుల పరిస్థితిపై అధికారులు ఆరా తీశారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన సహాయంపై వివరాలు సేకరించారు. విద్యార్థుల పరిస్థితికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని థాయ్‌లాండ్ లోని భారత రాయబారికి పంపించారు. థాయ్‌లాండ్‌లో స్థానిక కరెన్సీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఏపీ భవన్ అధికారులు తెలిపారు. విద్యార్థులకు సహాయం అందేలా తక్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు సూచనలు ఇవ్వాలని భారత రాయబారిని అధికారులు కోరారు. అలాగే విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, వారిని సురక్షితంగా దేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ భవన్ అధికారులు వెల్లడించారు.

# సగర్వంగా హర్ ఘర్ తిరంగా

### ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ పోస్ట్

న్యూఢిల్లీ: భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీమంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు.

# బీసీలను అణగదొక్కే ఆధిపత్య రాజకీయ నాయకుడికి చరమగీతం ఎప్పుడు..?

## మాడ్గుల కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై అధిష్టానం దృష్టి సారించాలంటున్న నాయకులు..

**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి):** మాడ్గుల మండలంలో కొంతకాలంగా ఒక అగ్రవర్ణ నాయకుడి ఆధిపత్య రాజకీయాలు కొనసాగుతున్నాయంటూ బీసీ, ఇతర వర్గాలకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకే నాయకుడి కోసం బీసీ నాయకులు, కార్యకర్తలు బారులు తీరుతూ గులాంగిరి చేయించు కోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. తమ జనాభా, రాజకీయ బలం గురించి ఆలోచించి బీసీ నాయకులు ఇకనైనా స్వతంత్రంగా ఎదగాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**"తాత కాంగ్రెస్.. ముత్తాత కాంగ్రెస్" అంటూ మాయమాటలా..?**

దశాబ్దాల రాజకీయ అనుభవం ఉందంటూ చెప్పుకునే కొందరు నాయకులు అన్ని పార్టీలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ, కాంగ్రెస్‌లో మాత్రం తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాంటి నాయకుల కోసం ఇన్నాళ్లు పనిచేసిన బీసీ, రెడ్డి సామజిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

**కాంగ్రెస్ కండువా ఏసుకొని కద్దార్ చొక్కా తొడగితే ఓర్వలేరా..?**

మాడ్గుల మండలంలో బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుని కద్ధార్ చొక్కా తోడిగితే ఆ అగ్రవర్ణ నాయకుడు ఓర్వలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలమైన వారినే ప్రోత్సహిస్తూ, ఎదుగుతున్న నాయకులను అడ్డుకునేందుకు రాజకీయంగా పావులు కదుపుతున్నారనే విమర్శలు సొంత పార్టీ వర్గాల నుంచే రావడం చర్చనీయాంశంగా మారింది.మాడ్గుల మండలం లో పలు ప్రభుత్వ కార్యాలయలలో ఆయన్ని కాదని ఏ చిన్న పని బిదాలకు అధికారులు చేసిన వారిపై కస్సు, బుస్సు అంటూటరాని ఆ నాయకుడీ పై ప్రజలు మండిపడ్తున్నారు.

**జెడ్పీటీసీ బరిలోకి వస్తారనే ప్రచారం..**




రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ స్థానం వస్తే ఆ నాయకుడు జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం మండలంలో జరుగుతోంది. అయితే ఆయన ఆధిపత్య రాజకీయాలకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో సొంత పార్టీ అభ్యర్థుల ఓటమికి సహకరించారనే ఆరోపణలు., తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మాడ్గుల మండలంలో బలమైన కాంగ్రెస్ నాయకులను ఓడించేందుకు సంబంధిత నాయకుడు ఇతర పార్టీలకు చెందిన నాయకులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నాయకుడి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

**ప్రభుత్వ పథకాల అమలుపైనా విమర్శలు.**

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో కూడా కాంగ్రెస్‌కు చెందిన అర్హులైన నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని, ఇతర పార్టీలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితం..

**ప్రజలకు చేసింది ఏమిటి?**

నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని ప్రసంగాల్లో చెప్పుకోవడం తప్ప మాడ్గుల మండల ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని సొంత పార్టీ నాయకులే ప్రశ్నిస్తున్నారని సమాచారం. వ్యక్తిగత ఆధిపత్యం కోసం పార్టీని బలహీనపరిచే రాజకీయాలకు స్వస్తి పలకాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అధిష్టానం జోక్యం చేసుకోవాలని డిమాండ్**

మాడ్గుల మండల కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య అసంతృప్తిపై పార్టీ రాష్ట్ర అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. మండలంలో పార్టీ పరిస్థితిపై పూర్తి స్థాయిలో ఆరా తీసి, ఆరోపణలపై విచారణ జరిపి, నిజానిజాలు తేల్చాలని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే క్రమశిక్షణ కమిటీ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఆ సంస్థతో సిఎం సోదరుడికి సంబంధం లేదు

### నిబంధనల మేరకే సంస్థకు భూ కేటాయింపులు

### మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ



హైదరాబాద్,ఆగస్ : టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం సోదరులకు భూ కేటాయింపులు చేశారంటూ ఆయన అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఎకరం రూ.90లక్షలకు ఇస్తే.. మేం రూ.కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దానికంటే రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ. నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయి. ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు సంబంధం లేదు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆయన ఆరోపణలు చేయడం.. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? తక్కువ ధరకు ఎందుకు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మీడియాలో వస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా అని అన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో మాటని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

### మంఖల్ లో అమాయక రైతుల భూమిపై

# కన్నేసిన భూ'భకా సురుడు...?

కోట్లు విలువైన భూమిని కొల్లగొట్టాలని నకిలీ పత్రాలతో గోపాలరావు ప్రయత్నం ..!

మంఖాల్ గ్రామానికి చెందిన చలేంద్రి యాదయ్యకు చెందిన 5.30 ఎకరాల వ్యవసాయ భూమి...!

వందల మంది కిరాయి మహిళలు మగవారితో, రైతు భూమి కబ్జాకు యత్నం

పహాడీ షరీఫ్ లో గోపాల్ రావుపై ఫిర్యాదు చేసిన రైతు యాదయ్య కుటుంబ సభ్యులు

పేద రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జల్పల్లి నరేందర్ యాదవ్





**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల మంఖాల్ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 60 లో సలేంద్రి యాదయ్య అనే పేద రైతు 5 ఎకరాల 30 గుంటల భూమిని గోపాలరావు అనే వ్యక్తి వందల మంది కిరాయి గుండాలను రౌడీలను తీసుకొచ్చి మా భూమి కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని రైతు యాదయ్య వాపోయారు. వెంటనే పహాడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని రైతు భూమి వద్దకు వచ్చిన వ్యక్తులను పోలీసులు పంపించారు. ఈ సందర్భంగా రైతు యాదయ్య మాట్లాడుతూ 1986 లోనే భూమి కొనుగోలు చేశానని నా దగ్గర భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని రైతు యాదయ్య తెలిపారు. కావాలని కొందరు నకిలీ డాక్యుమెంట్ సర్టిఫికెట్ తయారు చేసి భూమి కబ్జా చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని యాదయ్య తెలిపారు. తక్షణమే న్యాయం చేయాలని నా భూమి నాకే ఉండే విధంగా చూడాలని రైతుల భూమి కబ్జా చేస్తున్న గోపాల్ రావు పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు జల్పల్లి నరేందర్ యాదవ్ (రాష్ట్ర దళిత విభాగం) మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతులకు అండగా ఉంటుందని అమాయకమైన




రైతులపై అన్యాయం చేయాలని చూస్తే పార్టీ ప్రభుత్వం ఊరుకోదని ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పహాడి షరీఫ్ సిఐ ని కోరడం జరిగిందని ఆయన అన్నారు. మంఖల్ రెవెన్యూ సర్వేనెంబర్ 60 లో ఉన్న భూమి రైతు యాదయ్య దే అని కొందరు కావాలని కుట్రలు చేసి గోపాల్ రావు అనే వ్యక్తి గుండాలను వ్యక్తులను తీసుకొచ్చి దౌర్జన్యం చేస్తూ అమాయక రైతులను బెదిరిస్తూ వారిపై దాడి చేస్తూ ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని పోలీసులు రైతు యాదయ్యకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇలాంటి వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇలాంటివారిని తరిమికొట్టాలని డాక్యుమెంట్లు సృష్టించి ఇతరుల భూమి కబ్జా చేస్తున్న వారి పట్ల ప్రభుత్వం కానీ పోలీసులు గాని కఠినంగా వ్యవహరించాలని నరేందర్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో కుంభం సురేష్ యాదవ్ మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్ర చంద్రమోహన్, రైతు యాదయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## అమ్మవారికి మారుబోనం సమర్పించిన మంత్రి సురేఖ

### ఉజ్జయిని మహాకాళిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మారు బోనం సమర్పణ కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. బోనమెత్తిన మహిళలకు ఈ సందర్భంగా మంత్రి సురేఖ చీరె, సారె అందజేశారు. సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని మంత్రి సురేఖ అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఆషాడ బోనాల ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహలతో జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలి: ఫైసల్

### డెబ్బై ఏళ్ల చరిత్ర కలిగిన సంఘం టీయూడబ్ల్యూజే--ఐజేయూ

పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 11: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం జర్నలిస్టులంతా ఐక్యంగా, సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్--ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ ఫైజల్ అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే--ఐజేయూ విస్తృతస్థాయి సమావేశం రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫైజల్ మాట్లాడుతూ.. డెబ్బై ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన టీయూడబ్ల్యూజే--ఐజేయూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తుందని చెప్పారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి జర్నలిస్టుకు పది లక్షల రూపాయల ఆరోగ్య బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఒత్తిడి తీసుకొస్తున్నామని చెప్పారు. జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఉచిత విద్య అందించేలా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా సర్క్యులర్లు జారీ చేయించినప్పటికీ కొంతమంది ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వాటిని అమలు చేయడం లేదని అన్నారు. ఈ సమస్యపై కూడా జర్నలిస్టుల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పటాన్‌చెరులో జర్నలిస్టుల సంఘం అవసరం లేదనే భావన గతంలో తనకు ఉండేదని,



అయితే ఈ సమావేశానికి హాజరైన తర్వాత తన అభిప్రాయం తప్పని అర్థమైందని ఫైజల్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి యూనియన్ అభివృద్ధికి ఎంతోమంది జర్నలిస్టులు మూలస్తంభాలుగా నిలిచారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. టీయూడబ్ల్యూజే--ఐజేయూ ప్రభుత్వ పరంగా పారదర్శకంగా వ్యవహరిస్తుందని, ప్రతి సంవత్సరం సంఘానికి ఆడిట్ జరుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన ఉద్దేశమన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రతకు ప్రాధాన్యం టీయూడబ్ల్యూజే--ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి మాట్లాడుతూ.. సంఘంలో ప్రతి జర్నలిస్టుకు గౌరవం దక్కుతుందన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల విషయంలో అవసరమైనప్పుడు అందరూ సంఘటితంగా గొంతెత్తాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు జర్నలిస్టుల సమిష్టి కృషితోనే తాను జిల్లా స్థాయికి ఎదిగానని తెలిపారు. పటాన్‌చెరు జర్నలిస్టులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. సమావేశానికి టీయూడబ్ల్యూజే--ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్ అధ్యక్షత వహించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సంయుక్త కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్, ఈసీ సభ్యులు మజీద్, శ్రీనివాస్,



ఫొటోగ్రాఫర్ జిల్లా అధ్యక్షులు ఆరీప్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు సిద్దిఖ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే--ఐజేయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా పత్తి నర్సింహా, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సలహాదారులు కాశీపతి, సులేమాన్, రామారావు, ఉపాధ్యక్షులు విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, రమేష్, జీవరత్నంసంయుక్త కార్యదర్శులు: వేణు, ప్రభాకర్, శ్రీనివాస్, కోటేష్, శివాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, ముక్కగల్ల రాజు, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ సభ్యులు శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్‌గౌడ్, సిద్దు, శ్రీనివాస్, రాజశేఖర్, ప్రదీప్‌రెడ్డి, విజయ్, నాయుడు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర, జిల్లా నాయకులు, జర్నలిస్టు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నూతన కమిటీ సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు.



# రామాయణంలో సీత పాత్ర వివాదం.. సాయి పల్లవి పాత ఇంటర్వ్యూ వైరల్!

రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. సీత పాత్రకు సాయి పల్లవిని ఎలా తీసుకున్నారంటూ కొందరూ కామెంట్లు చేస్తుండగా.. ఈ చర్చల మధ్య సాయిపల్లవి గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది. సాంప్రదాయ రూపురేఖల గురించి కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, ఆమె నటనకు, సహజ సౌందర్యానికి మరికొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి మొటిమల సమస్య, ఫెయిర్‌నెస్ క్రీమ్ యాడ్ తిరస్కరించడం గురించి సాయి పల్లవి గతంలో చెప్పిన ఆసక్తికర విషయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సినిమాల్లోకి రాకముందు తనకు ఉన్న మొటిమలు, రోసిషియా సమస్య కారణంగా ఎంతో ఆందోళన చెందానని సాయి పల్లవి గతంలో తెలిపారు. 'ప్రేమమ్' సినిమా విడుదలకు ముందు నేను ఎన్నో ఫెయిర్‌నెస్ క్రీమ్‌లు వాడాను. ముఖంపై మొటిమల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించాను. నలుగురిలోకి వెళ్లడానికి భయపడేదాన్ని. జనం నా కళ్లను కాకుండా నా మొటిమలనే చూస్తున్నారని బాధపడేదాన్ని అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే 'ప్రేమమ్' చిత్రంతో ప్రేక్షకులు తనను ఉన్నట్లుగానే ఆదరించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు. సౌందర్య ప్రమాణాలు, రంగు వివక్షపై సాయి పల్లవి ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇందులో భాగంగానే రూ. 2 కోట్ల విలువైన ఫెయిర్‌నెస్ క్రీమ్ ఎండార్స్‌మెంట్ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించారు. సమాజంలో ఇటువంటి ప్రచారాలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆమె భావించారు. సమాజంలో రంగు ఆధారంగా ఎంతోమందిని చిన్నచూపు చూస్తున్నారు. అలాంటి ప్రమాణాలను నేను ప్రమోట్ చేయలేను అని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె పాత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.

# త్వరలో పెళ్లి పీటలెక్కనున్న పూజా హెగ్డే?..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్, బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి కొత్త సినిమా లేదా గ్లామరస్ ఫోటోషూట్ వల్ల కాదు, తన పెళ్లి వార్తలతో ఆమె సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. త్వరలోనే పూజా హెగ్డే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె కెరీర్ పరంగా కాస్త నెమ్మదించిన ఈ తరుణంలో ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఇది ప్రేమ వివాహం కాదని, కుటుంబ సభ్యులు చూసిన సంబంధానికే పూజా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. అయితే ఆమె చేసుకోబోయే వరుడు సినీ పరిశ్రమకు చెందిన వారా లేక వ్యాపారవేత్తా అనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నప్పటికీ, పూజా హెగ్డే గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ ప్రచారంలో నిజమెంత ఉందనేది తేలాల్సి ఉంది. అభిమానులు మాత్రం అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు టాలీవుడ్‌ను ఏలిన పూజా హెగ్డే కెరీర్‌ను పరిశీలిస్తే, 2014లో 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత 'ముకుంద'లో నటించినా, ఆమెకు అసలైన బ్రేక్ ఇచ్చింది మాత్రం అల్లు అర్జున్‌తో చేసిన 'డీజే: దువ్వాడ జగన్నాథం'. ఈ సినిమా తర్వాత ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', మహేష్ బాబుతో 'మహర్షి', అల్లు అర్జున్‌తో 'అలా వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌లతో అగ్ర కథానాయికగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అగ్రస్థానంలో దూసుకెళ్తున్న సమయంలో ఆమెకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ప్రభాస్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'రాధే శ్యామ్' భారీ అంచనాలతో విడుదలై నిరాశపరిచింది. ఆ తర్వాత 'ఆచార్య', తమిళంలో 'బీస్ట్', హిందీలో నటించిన చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. దీంతో ఆమె కెరీర్ కొంత నెమ్మదించింది. అయితే, ప్రస్తుతం పూజా హెగ్డే కొత్త ప్రాజెక్ట్‌లతో మళ్లీ బిజీ అవుతున్నారు. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'శ్రీశ్రీ' చిత్రంలో, రాఘవ లారెన్స్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంచన 4'లోనూ ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. వీటితో పాటు అల్లు అర్జున్ సరసన మరోసారి నటించే అవకాశం ఉన్నట్లు కూడా ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది.



# హృతిక్ రోషన్‌పై కంగనా రనౌత్ ఆగ్రహం.. మళ్లీ తెరపైకి ఆ పాత వివాదం!


బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలిచే ప్రముఖ నటి, ఎంపీ కంగనా రనౌత్ మరియు స్టార్ హీరో హృతిక్ రోషన్ మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'సారీ హృతిక్' (ాశీతీతీఎ ఎతీఱష్ట్రఱఎ) ట్రెండ్ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వివాదం మళ్లీ రాజుకుంది. ఈ సోషల్ మీడియా ట్రెండ్‌పై హృతిక్ రోషన్ స్పందిస్తూ.. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలను నమ్మవద్దని, వాస్తవాలు తెలిసే వరకు ఎలాంటి అభిప్రాయాలకు రావద్దని సూచించారు. అయితే హృతిక్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన కంగనా రనౌత్, తన పేరును వాడుకుని సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేస్తున్న వారిని ఆపకుండా, ఇలాంటి వ్యాఖ్యలతో వివాదానికి ఆజ్యం పోయవద్దని హితవు పలికారు. సబా ఆజాద్‌తో నీవు సంతోషంగా ఉన్నావని తెలిసి ఆనందంగా ఉందని, మీరిద్దరూ మంచి జంట అని కంగనా పేర్కొన్నారు. కానీ ఇలాంటి వ్యాఖ్యలతో తనను మాటలతో ఇబ్బంది పెట్టడం మీ స్థాయికి తగదని, మీ భాగస్వామిని కూడా ఇరుకున పెట్టేలా ప్రవర్తించవద్దని కంగనా తెలిపింది. కాగా, 2016లో కంగనా రనౌత్ ఒక ఇంటర్వ్యూలో హృతిక్‌ను తన 'సిల్లీ ఎక్స్' అని సంబోధించడంతో వీరిద్దరి మధ్య అసలు వివాదం ప్రారంభమైంది. తాము ఎప్పుడూ రిలేషన్‌షిప్‌లో లేమని హృతిక్ బహిరంగంగా ఖండించడం, ఆ తర్వాత ఇరువర్గాల మధ్య లీగల్ నోటీసులు, ఈమెయిల్స్ వివాదం బాలీవుడ్‌లో పెద్ద సంచలనం సృష్టించాయి. ఇన్నాళ్లూ సద్దుమణిగిందనుకున్న ఈ పాత వివాదం, తాజా పరిణామాలతో మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# చిరంజీవి, నాగార్జునతో మల్టీస్టారర్.. అనిల్ ప్లాన్ అదుర్స్



మల్టీ స్టారర్ చిత్రాలకు తెలుగులో మంచి ఆదరణ ఉంటుంది. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తే.. యావరేజ్ ఉన్నా సరే.. సినిమాను సూపర్ హిట్ చేస్తారు. అందుకే గతంలో ఎక్కువగా మల్టీస్టారర్ చిత్రాలు వచ్చేవి. ఈ మధ్య తెలుగు హీరోలంతా పాన్ ఇండియా సినిమాలపై ఫోకస్ పెట్టడం.. సోలోగా రాణించాలనే తపనతో మల్టీస్టారర్‌పై ఆసక్తి చూపించడం లేదు. అయితే స్టార్స్ కలిసి చేస్తే మాత్రం ఆ సినిమా చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పుడు అదే చేయబోతున్నాడు. టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జునలతో క్రేజీ సినిమా తెరకెక్కించబోతున్నాడట. అనిల్ రావిపూడి సినిమాలు ఎలా ఉంటాయో తెలిసిందే. స్టార్స్‌తో కూడా కామెడీ చేయించి హిట్ కొడతాడు. ఇప్పటికే చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణలతో బ్లాక్ బస్టర్ హిట్స్ తీశాడు. ఇప్పుడు ఆయన ఫోకస్ నాగార్జునపై పడింది. నాగార్జునతో సినిమా చేస్తానని అనిల్ ఎప్పటి నుంచో చెబుతున్నాడు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌ని పట్టాలపైకి ఎక్కించబోతున్నాడు. ప్రస్తుతం నాగార్జున తన 10వ సినిమాలో బిజీగా ఉన్నాడు. ఇది పూర్తయిన తర్వాత అనిల్‌తో సినిమా చేస్తాడని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం.. నాగార్జునతో సోలో సినిమా కాకుండా చిరంజీవిని కూడా కలిపి మల్టీస్టారర్ రూపొందించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నాడట. ఇలా ఇద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే అభిమానులకు అది నిజంగా పండగ అనే చెప్పొచ్చు. అంతేకాదు.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ది ప్యారడైజ్‌లో స్పెషల్ సాంగ్.. కీర్తికి భారీగా రెమ్యునరేషన్..!



టాలీవుడ్‌లో సూపర్ హిట్ జంటల్లో నాని, కీర్తి సురేశ్ ఒకరు. వీరిద్దరు జంటగా నటించిన నేను లోకల్, దసరా మూవీస్ బాక్సాఫీస్ వద్ద అదరగొట్టేశాయి. అయితే మరోసారి ఈ హిట్ కాంబోను తెరపై చూసే అవకాశం రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం నాని హీరోగా వస్తోన్న ది ప్యారడైజ్‌లో కీర్తి సురేశ్ కనిపించనుందని సమాచారం. ఆమెను ఓ స్పెషల్ సాంగ్ కోసం తీసుకున్నారని టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ ప్రత్యేక పాట కోసం కీర్తి సురేశ్ ఓకే చెప్పారని.. అయితే కేవలం రెండు రోజుల కాల్‌షీట్లు మాత్రమే కేటాయించినట్లు టాక్ నడుస్తోంది. ఈ రెండు రోజుల షూటింగ్ కోసం ఆమె భారీగా రెమ్యునరేషన్ అందుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇది కాస్తా టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఈ సాంగ్‌ను దర్శకుడు శ్రీకాంత్ ఒదెల చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఈ సాంగ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.